# త్రివేణి

"సిగ్గులేకపోతే సరి మనకి ఉత్తరం రాయడానికి? - మీరు అసలు మనుష్యులు కారమ్మా!" గబగబ చొక్కా తొడుక్కుని గుండీలైనా పెట్టుకోకుండా డాబా మీదకి వెళ్ళిపోయాడు సుందరం. మనస్సు ఉడికిపోతోంది. డాబా మీద వీచే చల్లగాలి ఆ తాపాన్ని అణచలేదు. పిట్టగోడనానుకుని నిలబడి, చేతులతో తల పట్టుకున్నాడు. ఆడదై వుండి కూడా అమ్మకి అర్థం కాదే యీ బాధ. "మా అక్కనిచ్చి పెళ్ళి చేసేస్తాము. గృహస్థాశ్రమం స్వీకరించండి" అని పదేళ్ళ క్రితం కుటుంబరావుని బ్రతిమాలి తీసుకొచ్చినవాడు తను. మంగళ వాయిద్యాలు భోరుమని మ్రోగుతోంటే పుస్తె కట్టిన ఆ బావ ఎంత తేలిగ్గా బంధం తెంపేసుకున్నాడు. అతను యీ పని చేసి ఏడాది కూడా కాలేదు.

"నువ్వు నాకు బావవి కావు. నేను నీకు మరిదిని కాను. మా అక్కయ్యని పంపేయి. మాకేమీ ఆమె బరువుకాదు" అని తను బావ రెండో పెళ్ళి చేసుకుంటున్ననాడే వ్రాశాడు.

"అయ్యో, కాపురం వదులుకుని అదెల్లా వస్తుందిరా!" అన్నది అమ్మ.

"ఎవరిదమ్మా కాపురం? అక్కయ్యదా? ఆ వచ్చే ఆవిడదా?" అని అతను కస్సుమన్నాడు. అమ్మ కళ్ళల్లో నీరు తిరిగింది.

విశాలకి పెళ్ళయి పదేళ్ళయినా పిల్లలు పుట్టలేదు. ఇక పుట్టరని డాక్టర్లు తేల్చారు. మరో పెళ్ళి చేసుకోమని కుటుంబరావు యింట్లో వాళ్ళంతా పోరు మొదలెట్టి నాలుగేళ్ళయింది. రెండేళ్ళ క్రితం విశాల పుట్టింటికి వచ్చినప్పుడు అమ్మకి, నాన్నకి ఆ మాట చెప్పుకుని ఏడిచింది. సుందరం యీ సంగతి వినగానే యింట్లో పెద్ద వాదన వేసుకున్నాడు.

"ఆయన రూలు ప్రకారం చేసుకోవచ్చుట కదా?" అన్నది విశాల. ఆమె విశాల నయనాల్లో మెరిసే అమాయకత్వం, నిండిన నీరు చూసి సుందరం గుండె పగిలిపోయింది.

"ఏం పిల్లలు లేకపోతే? ఎవర్నైనా పెంచుకోవచ్చుగా? మళ్ళీ పెళ్ళి ఎలా చేసుకుంటాడో నేను చూస్తాను" అన్నాడతను.

అంతవరకూ మాటాడకుండా భోంచేస్తున్న నాన్న, సుందరం కంఠంలో తీవ్రతకి తలెత్తి చూశారు. "ఏం నాన్నా! వూరుకుంటారు? నట్టేట్లో వదిలేయమనేనా అయిదువేలు కట్నం పోసి పెళ్ళి చేసింది? తన సుఖం తను చూసుకుంటాడా ఆ పెద్ద మనిషి?" అన్నాడు సుందరం.

"ఏం చేస్తాంరా మనం?" అన్నాడు నాన్న. "పెళ్ళి ఆపేద్దామనీ, పిల్లని ఎవరిస్తారో చూస్తాననీ" ఎన్నో ఆవేశంగా అన్నాడు సుందరం. అసలు మనిషి, అక్కయ్యే నీళ్ళు కారిపోతోంటే తనేం చేయగలడు? పెళ్లి జరుగుతున్ననాడు తను ఒక్కత్తే ఎల్లా వుందో వూహించుకో లేకపోయాడు సుందరం.

"వెళ్ళి తీసుకొచ్చేస్తాను మా అక్కయ్యను. నేను ఆజన్మాంతం చూసుకుంటా" అని గొంతు చించుకున్నాడు. 'ఆమె రాదు. అతను పంపడు. అమ్మ, నాన్న అక్కని తీసుకురావడానికి వప్పుకోరు. ఏం చేయాలి? ఏం చేయాలి' అని ఈ చిక్కు ముడిలో పడి గిలగిలలాడాడు సుందరం. పెళ్ళయిన పదినెలల తర్వాత యీనాడు ఉత్తరం వచ్చింది బావదగ్గర్నించి. పండక్కి విశాల వస్తుంది తీసుకెళ్ళమని. అక్కయ్య ఆ ఇంట్లో ఎల్లా బ్రతుకుతుందో వూహించనైనా వూహించలేరా అమ్మ, నాన్న? సంక్రాంతి పండక్కి ఆయన తన క్రొత్త అత్తారింటికి వెడతాడుట. అందుకు అక్కయ్యని తను తీసుకు రావాలి. వెళ్ళేవాడు వెళ్ళవచ్చుగా. అక్కయ్య సంగతి తన కెందుకు?

తల దిమ్ముగా ఉంది. తనేమీ చేయలేని నిస్సహాయుడు. కాళ్ళు చేతులు తన్నుకుంటూ గుక్కపెట్టి ఏడిచే పసివాడు ఎంత నిస్సహాయుడో తనూ అంతే. చీకటి పడింది. నల్లగా వుంది రాత్రి. రివ్వుమని చల్లనిగాలి వచ్చి వీపుని తాకుతోంటే క్రిందికి దిగి వచ్చాడు.

అమ్మ వసారాలో మంచంమీద పడుకుంది. గదివేపు తిరిగి, సుందరం అడుగుల చప్పుడుకి ఆమె ఇటు తిరిగింది. "నాన్నగారు సినిమాకి వెళ్ళారు. నువ్వు అన్నానికి వస్తావా?" అన్నది.

"నాకు తినాలని లేదమ్మా!" అని వీధిగదిలోకి వెళ్ళి పేపరు తీసుకున్నాడు.

కాస్సేపటికి అమ్మ అక్కడికి వచ్చింది. "తినేద్దాం, రారాదూ? పనైపోతుంది" అన్నది.

"నేను తినను" అన్నాడు సుందరం పేపరులోకే చూస్తూ.

ఆమె కొంచెం ఆగి, "తెల్లారుఝామున వెడతావా మరి.. ఎల్లుండేగా పండగ?" అన్నది.

సుందరం తలెత్తి చూశాడు. "నేను వెళ్ళలేనమ్మా ఆ యింటికి?" అన్నాడు. అమ్మకి అర్థం ఔతుంది.. తను ఎందుకు వెళ్ళలేదో.

"వాళ్ళు ముందే వెళ్ళివుంటారు... కొత్త పెళ్ళికొడుకుగా" అన్నదామె. మనస్సులో బాధపడే అంటుందో లేక పోతే వూరికినే అంటుందో యిల్లాంటి మాటలు తెలియదు. మనస్సుని మెలిపెట్టే మాటలు లోపలే దాచుకోవాలిగానీ, ఎల్లా అనేస్తుంది బయటికి? దిగులుగా వుండే విషయాలు. పైకి అంటే దు:ఖం వస్తుంది. బావ క్రొత్త పెళ్ళికొడుకులా ఆమెతో కలిపి అత్తారింటికి కులుకుతూ ప్రయాణమవడం వూహించుకుంటే పట్టలేని అసహ్యం వచ్చింది సుందరానికి. "అక్కయ్యని తీసుకెళ్ళమని యీయన పురమాయింపు దేనికి? తను వ్రాయలేదూ?" అన్నాడు.

అమ్మ ముఖం చిట్లించింది. "అన్నిటికీ ఏదో ఒక రంధి లేనిది నీతో ఏపనీ కాదు. అయిపోయిందానికి ఏం చేస్తాం. నువ్వూ నేనూ యిప్పుడు?" అని లోపలికి వెళ్ళిపోయింది. సుందరం పేపరు అక్కడే పడేసి, తలుపు జేరవేసి బయటికి వెళ్ళాడు. శారద అయినా వుంటే మనస్సు ఎంత బాగుండకపోయినా యింట్లో ఉండాలనిపిస్తుంది. ఆమె పుట్టింటికి వెళ్ళి పది రోజులు కావస్తోంది.

తిరిగి తిరిగి తొమ్మిదయ్యేసరికి యింటికి చేరుకున్నాడు. నాన్న వచ్చాక భోజనానికి కూర్చున్నారు. 'వెళ్ళి దాన్ని తీసుకురావూ?' అని ఆయన అడగలేదు. సినిమా కబుర్లు చెబుతోంటే అమ్మ వింటూ కూర్చుంది. మళ్ళీ ముందు గదిలోకి వచ్చి కూర్చుని పేపరు పుచ్చుకున్నాడు సుందరం. నాన్న కూడా వచ్చి పక్క కుర్చీలో. శాలువ కప్పుకుని కూర్చున్నారు.

అమ్మ వచ్చింది లోపల్నించి. "ఏమండీ, వాడు వెళ్లడుట. పోనీ మీరే వెళ్ళి విశాలని తీసుకురారాదూ?" అన్నది అమ్మ.

"ఏం – శారద అక్కడికి నిన్ను రమ్మని వ్రాసిందా పండక్కి?" అన్నారు నాన్న సుందరాన్ని చూసి.

"లేదు".

"మరింకేమి – వెళ్ళి తీసుకురా రాదూ?" అన్నది అమ్మ.

"ఎందుకే, వాడు వెళ్ళనంటూంటే అంత గోల చేస్తావు? ఊరుకోలేవూ?" అన్నాడు నాన్న విసుగ్గా.

అమ్మ ముఖం వేపు చూశాడు సుందరం. ఆమె చాలా చిన్న బుచ్చుకుంది. మరుక్షణం ఏడుపు బిగబట్టుకుంటూ, "పండుగపూట ఆ దిక్కుమాలిన కొంపలో ఒక్కతీ ఎల్లా ఉంటుందండీ! కన్నకడుపు కనక యింత బ్రతిమాలుతున్నాను. ఆ మహామారికి అన్ని ముచ్చట్లూ తీరుతాయి. రెండో పెళ్ళయినా" అన్నది. ఆమె గుమ్మం మీద కూల బడి ఏడుస్తోంటే, నాన్న గొంతులో దు:ఖం దిగమింగారు. సుందరం తల వంచుకున్నాడు.

వెల్లకిల్లా పడుకుని నక్షత్రాలు చూస్తున్నాడు సుందరం. గాలికి ప్రాణం లేచి వస్తోంది. మెట్ల మీద శారద అడుగుల చప్పుడు వినిపించి, తల దగ్గర వున్న లైటు వెలిగించాడతను. ఆమె వచ్చి ఎదురు మంచం మీద కూర్చుంది. "లైటు ఆర్పేద్దురూ... కళ్ళలోకి పడ్తోంది" అన్నది. అతను ఆమె వంకే చూస్తుండిపోయాడు. పుట్టింట్లో వున్న యీ మూడు నెలల్లో ఆమె వళ్ళు చేసింది. జడవిప్పి పాయలు మళ్ళీ అల్లుకుంటోందామె. అల్లుకోవటం ఆపి, "వదినగారిని తీసుకురావడానికి మీరు వెళ్ళనన్నారా?" అన్నది.

సుందరం మాట్లాడకపోయేసరికి, "అత్తయ్య చాలా బాధపడుతున్నారు" అన్నది.

"అంత బాధపడేమనిషి పెళ్ళికెందుకు వప్పుకుంది?"

"ఈవిడ వప్పుకోకపోతే మాత్రం ఆగుతుండేమిటండీ? ఆయనంతగా చేసుకోవాలని ఉబలాటపడుతోంటే ఎవరు ఆపగలరు?" అన్నది శారద. కొంచెం ఆగి, "అత్తయ్య మధ్యాహ్నం ఏడుస్తూ కూర్చున్నారు పాపం – వదినగారికి జ్వరంగా వుందని ఉత్తరం వచ్చింది. మీరు వెళ్ళిరండి నా మాట విని" అన్నది.

రెప్పవేయకుండా ఆమె వేపే చూస్తుండిపోయిన సుందరం నిట్టూర్చాడు. "నువ్వు చెప్పు శారదా. మరో మనిషి యింట్లో తన భర్తతో కలిసి మెలిసి తిరుగుతోంటే ఆడదానికి ఎల్లా వుంటుంది?" అని అడిగాడు.

శారద తలవంచుకుని వేలికి చీర కొంగు మెలిపెడుతోంది.

"చెప్పవేం శారదా? ఎవరైనా పరాయి మగవాడితో నువ్వు మాట్లాడితేనే మనస్సు ఎంత దహించుకుపోతుంది? ఇంత వూహించుకునే నేను అక్కయ్య అక్కడ ఉండటం సహించలేకపోతున్నాను. కళాకాంతుల్లేని ఆమె ముఖం చూడలేను." అన్నాడతను.

శారద కళ్ళెత్తి చూసింది. "ఆయన్ని చేసుకోవడానికి సిద్ధపడిన ఆ మనిషికి కాస్తయినా బాధ అనిపించదాండీ, తోటి ఆడదానికి అన్యాయం చేస్తున్నానని?" అన్నది.

శారద చెప్పింది నిజం. రెండో పెళ్ళి చేసుకున్న ఆ అమ్మాయికి (కనకానికి) మనస్సనేది వుంటే యీ పెళ్ళికి వప్పుకునేది కాదు. పాషాణం లాంటి మనస్సు కనుకే చేసుకోగలిగింది. ఇంత నిర్దయగా కర్కోటకంగా ఎల్లా వుంటారు ఆడవాళ్ళు! అతను ఇంకేమీ మాట్లాడకుండా వెనక్కి తిరిగి పడుకున్నాడు.

శారద లేచి వచ్చి అతని ఒంటి మీద చెయ్యి వేసింది. "మీరు మనస్సు పాడు చేసుకోకండి. ఎవరి రాతలు ఎల్లా వుంటే అలాగవుతాయి" అన్నది.

విశాలకి మామూలు జ్వరం కాదు టైఫాయిడ్ అని బావ వుత్తరం రాశాడు. దానిలో వచ్చి చూడండన్న ముక్కలేదు. "ఆ కనకమ్మ తల్లి రాయొద్దని వుంటుంది. టైఫాయిడంటే మాటలా? ఎల్లా వుందో?" అంటూ అమ్మ గోల గోల చేసింది.

కానీ, ఒకరు వెళ్ళమనే అవసరం లేకుండానే సుందరం బట్టలు సర్దుకోవడం ఆరంభించాడు.

"తీసుకువస్తావురా దాన్ని?" అనడిగింది అమ్మ.

"తెలియదమ్మా – చూడాలి" అన్నాడు.

"పోనీ శారదని నాతో తీసుకెళ్ళనా?" అన్నాడు ఆ తర్వాత. తను ఒక్కడూ వెళ్ళి ఆ సంసారాన్ని చూడలేడు.

అక్కయ్యమీద జాలి, బావమీద కోపం రెండూ సుందరానికి మనస్సులో పెనవేసుకుని పోయినాయి. అంతకంటే ఎక్కువగా ఆ మూడో మనిషంటే అసహ్యం సుడులు తిరుగుతోంది.

– రైలు చేరేసరికి ప్రొద్దున్న పదిన్నరయింది. బండి మలుపుతిరిగి ఆ వీధిలోకి వెడుతోంటే సుందరం ముఖం వంక చూసింది శారద. వంట్లో నెత్తురు లేని మనిషిలా, వెలితిగా వీధిలోని ఇళ్ళవంక చూస్తున్నాడతను. ఆమెకీ కలతగానే వుంది. అక్కడ అతను ఎదుర్కోబోయే సన్ని వేశాన్ని గురించి.

ఇంట్లో సామాను దింపుకుంటోంటే ఎక్కడా మనిషి అలికిడే వినబడక సుందరం గుండెలు గుబగుబ కొట్టుకున్నాయి. ముందు గదిలో చెప్పులు వదిలి లోపలికి వెళ్ళాడు. మంచం మీద అక్కయ్య నిద్రపోతోంది. చెంపలు ఎర్రగా ఎండిపోయినట్లు వున్నాయి. మెడ దగ్గర ఎముకలు కనపడుతున్నాయి. కిటికీ ప్రక్కన వున్న వున్న కుర్చీలో కూర్చున్నాడు.

శారద మెల్లిగా, "లోపలికి వెళ్ళి చూడనా? మీ బావగారు లేనట్లున్నారు" అన్నది. అతనేమీ అనలేదు. ఆమె లోపలికి వెళ్ళింది.

వంటింట్లో ఆమెతో (కనకంతో) మాట్లాడుతోంది శారద. రెండు నిముషాలకి శారద యివతలికి వచ్చింది. "నూట మూడు వుంటోందిట. ఫరవాలేదన్నారుట డాక్టరు. బావ ఆఫీసుకి వెళ్ళారు" అన్నది.

"ఎవరో డాక్టరు – కనుక్కోవాలి. కదిలించ వచ్చునంటే ఫస్టు క్లాసులోనైనా సరే తీసుకెళ్ళిపోదాం" అన్నాడు సుందరం. బావ యీమె గతికి యీమెని వదిలేసి ఆఫీసుకి వెళ్ళాడన్నమాట.

–మట్టెల చప్పుడు వినబడింది. చెంబు నీళ్ళు తెచ్చి గుమ్మం దగ్గర పెట్టి నిలబడింది ఆమె. తలెత్తి చూశాడు సుందరం. ఈ అమ్మాయి అన్నమాట కనకం అంటే. ఆమె ఒక్క నిముషం నిలబడి అవతలికి వెళ్ళిన తర్వాత లేచి చెంబు తీసుకున్నాడు సుందరం.

కాస్సేపటికి శారద లోపలికి వెళ్ళి కాఫీ తెచ్చింది. "లోపలి గదిలోకి వెడదాం రండి వదినగారు లేస్తారేమో!" అన్నది. లోపలికి వెళ్ళి కాఫీ త్రాగి, సామాను ఆ గదిలో పెట్టాడు అతను.

"చిన్నదేనండీ ఆవిడ. మీ బావ నిన్నటి వరకూ సెలవుమీదే వున్నారుట. పూర్తిగా తగ్గేసరికి ఇంకో రెండు వారాలవుతుంటే యీ వేళ నుంచే ఆఫీసుకి వెడుతున్నారట" అన్నది శారద.

"మనం వచ్చామేమిటని ఆశ్చర్య పోయిందా?" అన్నాడు సుందరం.

"ఏమో మరి. ఏమీ తేలడం లేదు పైకి" అని ఖాళీ గ్లాసులు రెండూ తీసుకుని లోపలికి వెళ్ళింది శారద.

అక్కయ్య లేచిందేమోనని మళ్ళీ ఆమె పడుకున్న గదిలోకి వెళ్ళాడు. ఆమె లేవలేదు. కుర్చీలో కూర్చున్నాడు. లేవగానే ఆమె ముఖం చూస్తే? ఈ బాధ నంతనీ నువ్వొక్కత్తెవే భరించు అని దూరంగా ఎడారిలో వదిలివేసినట్లు ఆమెని ఇన్నాళ్ళూ తామంతా చూడకుండా ఉండి పోయారు.

కళ్ళు మూసుకున్నాడతను. గాజులు, మట్టెలు చప్పుడై,, వద్దనుకుంటూనే కళ్ళు తెరిచాడు. కనకం కిటికీలోంచి ఒక బత్తాయి పండు, గాజు గ్లాసు తీసుకుంటోంది. మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు అతను. ఆమె వెళ్ళిన కాస్సేపటికి శారద వచ్చింది. "పదండి స్నానం చేద్దురు గాని" అన్నది.

అతను స్నానం చేసి, తిరిగి వచ్చేసరికి విశాల నిద్ర లేచింది. కనకం ప్రక్కన కుర్చీ మీద కూర్చుని చెంచాతో పండు రసం ఆమె నోట్లో పోస్తోంది. సుందరం వెళ్ళగానే రసం పోస్తున్నదల్లా ఆపేసి లేచి నిలబడింది.

విశాల తమ్ముడి వంక చూసింది. ఆమె కళ్ళల్లో చిక్కని చీకటి లాంటి అనుభవం కనబడింది సుందరానికి.

ముక్కు ఎర్రబడి ఆమె కళ్ళల్లోంచి నీరు కారసాగింది. సుందరం ఆమె మంచం దగ్గరగా వెళ్ళి చేయి పట్టుకున్నాడు. కాలిపోతోంది వళ్ళు. జుట్టు మీదకు కారే కన్నీళ్ళని దుప్పటి అంచుతో తుడిచాడు. ఒక్క నిముషమైనాక తమాయించుకుని, కనకం వేపు చూశాడు. ఆమె తల వంచుకునుంది. ఒక్క క్షణం ఆగి గ్లాసు కుర్చీ ప్రక్కన పెట్టి గదిలోంచి కదిలింది.

విశాల ప్రక్కనే ఆ కుర్చీమీద కూర్చుని "ఎల్లావుంది అక్కయ్యా?" అన్నాడు. ఆమె ఏదో అన్నది గానీ దు:ఖంతో మూసుకుపోయిన కంఠం లోంచి ధ్వని రాలేదు. కనకం తన ప్రక్కన పెట్టిన గ్లాసు తీసుకుని, ఆమె నోట్లో రెండు చెంచాలు పోశాడు.

"బావ వుత్తరం రాశారా?" అన్నది. "ఔను. శారద కూడా వచ్చింది. స్నానం చేస్తోంది" అన్నాడతను.

"ఆఫీసుకి వెళ్ళిపోయాడట కదా. పగలంతా నీకెల్లాగు మరి?" అనకూడదనుకుంటూనే అక్కసు పట్టలేక అనేశాడీ మాట.

"ఈవేళ వెళ్ళారు. కనకం ఉందిగా?" అన్నది విశాల మెల్లిగా. ఇంతగా తన గొంతు కోసినా యింకా వెనక వేసుకువస్తుంది వాళ్ళని. ఇటువంటి వెర్రి దానివి గనకనే నిన్నిల్లా ఆడించగలిగారు అని గబగబ అనేయాలనిపించింది అతనికి. ఈ స్థితిలో ఏమంటాడు?

గ్లాసులో సగం రసం త్రాగిందామె. ఇంక వద్దంది. "అమ్మ - నాన్న?" అనడిగిన ప్రశ్నకి "బాగున్నారని" సమాధానం చెప్పాడతను. స్నానం చేసి వచ్చిన శారద వంక చూసి పలకరింపుగా నవ్వింది విశాల. "ఈ వూరు మేము ట్రాన్స్ఫరై వచ్చాక నువ్వు రాలేదు".

"నువ్వు ఎక్కువ మాట్లాడవద్దు" అని వారించాడు సుందరం. ఆమె కళ్ళు మూసుకుంది. విసనకర్రతో విసురుతూ అతను ప్రక్కన కూర్చున్నాడు.

వారం రోజులు గడిచాక నార్మల్‌కి రావడం ప్రారంభించింది. "నేను వెళ్ళిపోతా. నువ్వుండు. పదిరోజులపాటు" అన్నాడు సుందరం. సరేనని తలూపింది శారద. బావతో ఆ ముక్క చెబితే ఆయనా సరేనన్నాడు. కనకానికి చెబుదామని వంటింట్లోకి వెళ్ళింది శారద. కనకం ఎక్కువగా మాట్లాడదు. అసలు మాట్లాడదు అన్న సంగతి గుర్తించాడు సుందరం.

కుటుంబరావు మొదటిరోజు సాయంత్రం ఏమి మాట్లాడాలో తోచనట్లు తచ్చాడాడు. మర్నాటి నుంచి అలవాటు పడ్డాడు యీ కొత్త స్థితికి. డాక్టరు వచ్చినప్పుడు కావలసినవి అందివ్వడం. తర్వాత వెళ్ళి మందులు, పళ్ళు కొనుక్కురావడం సుందరం చేసేవాడు యీ పదిరోజుల్లో. బావ ఏమిటో కొత్తగా ఉషారు పడుతున్నట్లు కనబడ్డాడు.

"నువ్వు వచ్చేసరికి ఆయనకి ధైర్యం వచ్చింది. అంతకు ముందు బెంబేలు పడి పోయారు" అన్నది విశాల.

"ఏం - అంత దిగులు దేనికి? మేము వచ్చి నిన్ను తీసుకుపోతే బెడద వదిలిపోతుందని అనుకోవడం లేదూ?" అన్నాడతను కళ్ళు చిట్లించి.

విశాల కళ్ళల్లో బాధమెదిలి కళ్ళు చెమర్చాయి. "ఎంత అన్యాయంగా అంటావురా?" అన్నది.

ఆమె నోటితో చెప్పలేదు. కనకం తనకెంతో చాకిరీ చేస్తోందని అరమరికలు అసహ్యం లేకుండా అన్ని పరిచర్యలూ చేస్తోండటం సుందరం కళ్ళారా చూశాడు. గొప్పకోసమైతే ఒక పూట చేస్తుంది. రెండు పూటలు చేస్తుంది. కానీ పదిహేను రోజులు వరసగా రాత్రి, పగలు చేస్తోందంటే – సుందరం అయిష్టంగానే విస్మయం చెందాడు. తన భర్తకి సంతృప్తి కలిగించాలని చేస్తోందా? లేకపోతే యిది కూడా యీ దాంపత్యంలో భాగం అని చేస్తోందా?

అక్కయ్య జీవితాన్ని నాశనం చేసిన రాక్షసి, ఆమె సుఖాన్ని లాగేసుకుని, తాననుభవిస్తున్న స్వార్థపరురాలు అని తన మనస్సులో ద్వేషించి, శపించిన మనిషి కళ్ళెదురుగా తిరుగుతోంటే తనకి ఆమె అర్థం కావడం లేదు. 'నీకు బుద్ధి వుందా, నువ్వు మనిషివేనా యీ పెళ్ళి చేసుకోవడానికి?' అని నిలవేసి అడగాలనిపించినంత కసి యిప్పుడెందుకనో రావడం లేదు.

"పత్యం పెట్టేవరకు ఉండమంటోంది కనకం" అన్నది శారద వచ్చి.

"నువ్వుండు. నాకు సెలవు యింక యివ్వరు" అని కొంచెం ఆగి, "ఒక్కత్తెవీ ఉండలేవా?" అన్నాడు చిలిపిగా చూస్తూ.

శారద ముఖం త్రిప్పుకుని "ఉండలేకేం? హాయిగా ఉంటాను" అన్నది.

"హాయిగా వుంటావా – నేను లేకపోతే?" అన్నాడతను.

కళ్ళు సిగ్గుతో మెరుస్తోంటే ఆమె నవ్వింది. మళ్ళీ వెంటనే సీరియస్‌గా అయిపోయింది. చటుక్కున అతని వేపు తిరిగి "ఏమండీ కనకాన్ని చూస్తే జాలి వేస్తోందండీ" అన్నది.

"ఏం?" అని తెల్లపోయాడతను.

"అంతా ఆమెని పాపం, సూటిపోటీ మాటలంటున్నారు. నిజానికి ఆమె తప్పేముంది. వాళ్ళ నాన్న కట్నం యిచ్చుకోలేక ఎప్పటికీ పెళ్ళి చేయలేక చివరికి యీ సంబంధం చేశాడు. ఐతే నీకిష్టం లేదా అని అడిగితే ఆమె తల వంచుకుంది. 'అక్కగారు చాలా మంచివారు అన్నది" అన్నది శారద.

సుందరం ఆమెకేసి అల్లా చూస్తుండిపోయాడు.

అతని చొక్కా గుండీ సవరిస్తూ కళ్ళు వాల్చి ఆమె యింకా ఏదో చెప్పబోయి సందేహంగా ఆగింది. "ఏమిటి చెప్పు?" అన్నాడతను.

"మనిద్దరం యింత చనువుగా వుంటున్నప్పుడు నాకు అనిపిస్తుంది. కనకానికి నిజంగా అన్యాయం జరిగిందని. అన్నగారికి యిప్పటికీ మీ అక్కయ్య మీదే ప్రాణం అంతా వుంటుంది. ఆమె ఏమవుతుందోనని ఒకటే ఆరాటపడుతుంటారుట. పెళ్ళయి ఏడాది కూడా కాలేదు కదా – ఆమె మనస్సు ఎలా వుంటుంది. ఎవరింట్లోనో వచ్చి వుంటూ పరాయి సొత్తుని వాడుకుంటున్నట్లుండదూ?" అన్నది శారద.

"ఎంత ఆలోచిస్తారు ఆడవాళ్ళు!' అనిపించింది సుందరానికి. తనకి మాత్రమే ఎంతో సన్నిహితమైన విషయాలుంటాయి దాంపత్యంలో. వీటిని మరో మనిషితో అందులోనూ తన భర్త ప్రగాఢంగా ప్రేమిస్తున్న మనిషితో కలసి పంచుకోవాలంటే ఎంత నిబ్బరం కావాలి? ఎంత నిర్లిప్తత కావాలి.

"అవసరం కొద్దీ చేసుకున్న మనిషిని నేను" అని నిన్న పేలవంగా నవ్వింది. 'ఆ అవసరం ఏమైనా నువ్వు తీర్చే ధోరణిలో వున్నావా?' అని నేను హాస్యానికి అంటే జవాబు చెప్పక ఏడిచేసింది" అన్నది శారద మళ్ళీ.

ఆ సాయంత్రం సుందరం ప్రయాణం కాలేకపోయినాడు. విశాల వద్దని గొడవ చేసింది.

"పత్యం తీసుకునే వరకు శారద వుంటుంది. ఆ తర్వాత బావ నిన్ను తీసుకొచ్చి అక్కడ దిగబెడతానన్నాడు" అని చెప్పాడు సుందరం.

"వద్దు- నేను రాను" అని గట్టిగా అంది ఆమె,

పలుచగా వున్న జుట్టు, పాలిపోయిన చెంపలతో ఆమె రూపు జాలిగా వుంది. "ఏం? రావూ? అమ్మ నిన్ను తీసుకు రమ్మని వ్రాసింది." అన్నాడతను.

ఆమె కళ్ళు గోడవేపు త్రిప్పుకుని, "మళ్ళీ నన్ను తెచ్చి యిక్కడ దిగబెడతానంటేనే వస్తా" అన్నది. పిచ్చి అక్కయ్యా అని అతని గుండె చెరువైపోయింది. "అల్లాగే అన్నాను గదా?" అన్నాడు.

ఇంటికి వచ్చేస్తోంటే రైలు పరుగెడుతోంటే పారే నీడలవేపు సుందరం చూశాడు. అక్క - బావ - ఆమె - జీవిత వలయంలో చిక్కుకున్న యీ ముగ్గురిలో ఎవరు ఎక్కువ దురదృష్టవంతులు? భగవంతుడు ఎవరికి ఎక్కువ అన్యాయం పాలు పంచి పెట్టాడు? అన్న ప్రశ్న అతనిలో ముల్లులా పొడిచింది.

తొలి ప్రేమ తీపిని చవి చూసి, బావ మనోమందిరంలో యిప్పటికీ కదిలించలేని పీఠం వేసుకుని కూర్చున్నది అక్కయ్య. ఆ మమత వదలలేక అనిశ్చిత స్థితిలో తచ్చాడుతున్నాడు బావ. మరి కనకం? - తొలి జన్మలో తను చేసిన పూజల ఫలం నిశ్శబ్దంగా అనుభవిస్తోంది.

**- యువ**